క్లుప్తంగా

అమల్లోకి కొత్త పీస్ రేట్ ఒప్పందం


ఒప్పంద పత్రాన్ని చూపిస్తున్న కలాసీలు

బలిజిపేట: మండలంలోని మార్కెట్ కలాసీలకు, కిరాణా కొట్టు యజమానుల మధ్య జరిగిన కొత్త పీస్ రేట్ ఒప్పందం అమల్లోకి వచ్చిందని సీఐటీయూ నాయకుడు మన్మధరావు తెలిపారు. ఈమేరకు అమల్లోకి వచ్చిన ఒప్పందాన్ని సోమవారం విలేకరులకు చూపించారు. ఈ సందర్భంగా మన్మధరావు మాట్లాడుతూ.. రెండు సంవత్సరాల కిందట చేసుకున్న ఒప్పందం ఈ నెల 5వ తేదీతో ముగియడంతో.. కొత్త ఒప్పందం చేసుకుని ఆరో తేదీ నుంచి అమలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, ఆవాలు తవుడు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్‌కు ఏర్పాట్లు


ఏర్పాట్లపై ఆరా తీస్తున్న ఎంఈఓ - 1 సామల, ఉపాధ్యాయులు

బలిజిపేట: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఈ నెల 7, 8 తేదీలలో నిర్వహించనున్న మండల స్థాయి స్కూల్ గేమ్స్‌కు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ -1 సామల సింహాచలం తెలిపారు. ఈ మేరకు పాఠశాలలో చేపడుతున్న ఏర్పాట్లను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 7వ తేదీన కబడ్డీ, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా పోటీలు.. 8న చెస్, ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయని చెప్పారు. మండల పరిధిలోని ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వి.వెంకటనాయుడు, పీఈటీలు షేక్‌సుభాని, డి.సీతంనాయుడు, లక్ష్మణదొర, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు వైద్య పరీక్షలు


విద్యార్థినులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

సీతానగరం: మండలంలోని జోగింపేట విద్యాలయాల విద్యార్థినులకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ముందుగా కేజీబీవీ విద్యార్థినులకు హెల్త్ సూపర్‌వైజర్, వైద్య సిబ్బంది పరీక్షించారు. చర్మవ్యాధులతో పలువురు బాధపడుతున్నట్లు గుర్తించి, మందులు అందజేశారు. అలాగే గిరిజన ప్రతిభా విద్యాలయంలో కూడా వైద్య పరీక్షలు నిర్వహించి, పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో విద్యాలయాల సిబ్బంది, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


రెవెన్యూ సమస్యలు తక్షణమే పరిష్కరించండి

- జేసీ యశ్వంత్‌కుమార్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జాయింట్ కలెక్టర్ సి. యశ్వంత్‌కుమార్ రెడ్డి

పార్వతీపురం రూరల్: రెవెన్యూ సమస్యలతో వచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంయుక్త కలెక్టర్ సి. యశ్వంత్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన వినతులపై జేసీ సోమవారం సమీక్షించారు. గత వారంలో వచ్చిన అర్జీలపై కేసుల వారీగా, కేటగిరీ వారీగా ఆరా తీశారు. సమస్యలపై ఏయే చర్యలు తీసుకున్నారో అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో డీఆర్‌ఓ కె.హేమలత, ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో దిగొచ్చిన ధరలు


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీవరం

గుమ్మలక్ష్మీపురం: జీఎస్టీ తగ్గింపుతో ధరలు దిగివచ్చాయని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీవరం కోరారు. అదే కళాశాలలో సోమవారం సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించారు. సెప్టెంబరు 22వ తేదీ నుంచి సవరించిన కొత్త జీఎస్టీ శ్లాబ్‌లు అమలులోకి వచ్చాయని, దీంతో కొన్ని నిత్యావసరాలు, ఎలక్ట్రానిక్ వస్తువుల ధరలు తగ్గాయని అధ్యాపకురాలు కల్పన తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

- సమ్మెలో వైద్యులు
- ట్రైనీ డాక్టర్స్‌తో వైద్య సేవలు
- అరకొర వైద్యసేవలతో రోగుల ఇక్కట్లు

వెలవెలబోతున్న పీహెచ్‌సీలు


రోగులు లేక నిర్మానుష్యంగా మారిన పీహెచ్‌సీ

సీతానగరం:

వైద్యులు తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తుండడంతో రోగులు రాక పీహెచ్‌సీలు వెలవెలబోతున్నాయి. నిరంతరం రోగులతో కళకళలాడే మండలంలోని పెదంకలాం, సీతానగరం పీహెచ్‌సీలు నేడు రోగుల కోసం ఎదురుచూస్తున్నాయి. మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి రోజుకు 80 నుంచి వంద మంది సాధారణ రోగులు వస్తుంటారు. అలాగే జాతీయ రహదారిపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడంతో క్షతగాత్రులతో పాటు పాము, కుక్క కాటు బాధితులు ఎక్కువగా పీహెచ్‌సీకి వస్తుంటారు. అలాగే పెదంకలాం పీహెచ్‌సీలో పరిసర గ్రామాలతో పాటు బలిజిపేట, గరుగుబిల్లి మండలాలకు చెందిన రోగులు ఎక్కువగా వస్తుంటారు. నిత్యం ఎంతోమంది రోగులకు వైద్య సేవలందించే ఆయా పీహెచ్‌సీల్లో నేడు అరకొరగా సేవలు అందుతుండడంతో రోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోందని రోగులు చెబుతున్నారు.


సీతానగరం పీహెచ్‌సీకి వచ్చిన ట్రైనీ డాక్టర్లు

అందుబాటులో ట్రైనీ డాక్టర్లు

రోగులకు సేవలందించేందుకు గాను ప్రభుత్వం ట్రైనీ డాక్టర్స్‌ను నియమించింది. అయితే వైద్యులు సమ్మెలో ఉన్న విషయం తెలుసుకున్న రోగులు ఆస్పత్రులకు పెద్దగా రావడం లేదు. పైగా ట్రైనీ డాక్టర్స్‌తో వైద్యం చేయించుకోవడానికి విముఖత చూపిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే వైద్యుల సమస్యలు పరిష్కరించి, రోగులకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వైద్యులను రప్పించాలి..

ప్రభుత్వం స్పందించి వైద్యులను వెంటనే పీహెచ్‌సీకి రప్పించేలా చర్యలు తీసుకోవాలి. సీతానగరం పీహెచ్‌సీకి జ్వర లక్షణాలతో సోమవారం వెళ్లాను. సరైన సేవలు అందలేదు. నాలాగే ఎంతోమంది రోగులు వెనుదిరిగారు. వైద్యుల సమస్యలు పరిష్కరించి, రోగులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. – ఎస్. వెంకటరమణ, బుద్దిపేట, సీతానగరం మండలం


డాక్టర్ లేని పెదంకలాం పీహెచ్‌సీ

రక్షిత నీరు అందించలేకపోవడం శోచనీయం..

- పీడీఎస్ఓ జిల్లా అధ్యక్షుడు సోమేష్

పార్వతీపురం: పల్లెలకు మద్యం సరఫరా చేసే ప్రభుత్వం.. గిరిజన విద్యార్థులకు కనీసం మంచినీళ్ల సరఫరా చేయలేకపోవడం శోచనీయమని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ (పీడీఎస్‌ఓ) జిల్లా అధ్యక్షుడు కె. సోమేష్ మండిపడ్డారు. పార్వతీపురంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కురుపాం గిరిజన బాలికల పాఠశాలకు చెందిన తోయక కల్పన, పువ్వల అంజలి ఇటీవల పచ్చకామెర్లతో మృతి చెందారన్నారు. అలాగే మరో 120 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారని చెప్పారు. వీరిలో ముగ్గురు ఐసీయూలో, 34 మంది విశాఖ కేజీహెచ్‌లో, మిగిలిన వారు పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. పాఠశాలలో రక్షిత మంచినీరు లేకపోవడం వల్ల విద్యార్థినులు కలుషిత నీరు తాగి రోగాల బారిన పడినట్లు వైద్యులు నిర్ధారించారన్నారు. విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. గడిచిన 15 నెలల్లో కూటమి ప్రభుత్వం ఆశ్రమ, గురుకుల పాఠశాలల సమస్యల పరిష్కారానికి ఒక్క చర్య కూడా తీసుకోలేదని ఇది నిర్లక్ష్యానికి పరాకాష్ఠన్నారు. మృతి చెందిన విద్యార్థినుల కుటుంబాలకు నష్ట పరిహారం చెల్లించడంతో పాటు సంఘటనకు బాధ్యులైన అధికారులు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రిని సస్పెండ్ చేసి సమగ్ర విచారణ జరిపి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

విజ్ఞాపన దీక్షను విజయవంతం చేద్దాం..

సాలూరు: తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయులు ఈ నెల 11న విజయవాడలో తలపెట్టిన విజ్ఞాపన దీక్షను విజయవంతం చేయాలని 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయుల యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొల్లి రామకృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. విజయవాడలోని ధర్నాచౌక్ వద్ద విజ్ఞాపన దీక్ష చేపట్టి ప్రభుత్వం దృష్టికి తమ న్యాయమైన డిమాండ్లను తీసుకెళ్లేందుకు రాష్ట్ర యూనియన్ నిర్ణయించిందన్నారు. వివిధ కారణాలతో 25 ఏళ్ల సర్వీస్‌ను కోల్పోయామని, అన్ని అర్హతలున్నా తమకు మినిమమ్ టైమ్ స్కేల్ ప్రాతిపదికన ఉద్యోగాలు ఇచ్చిందన్నారు. ఏడాదిలో 11 నెలలకే జీతాలు చెల్లిస్తున్నారని.. దీని వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమను రెగ్యులర్ చేసి 12 నెలల జీతం చెల్లించడంతో పాటు రిటైర్మెంట్ వయసును 62 ఏళ్లకు పెంచాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయులందరూ శాంతియుతంగా జరగనున్న విజ్ఞాపన దీక్ష కార్యక్రమానికి తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.


1998 ఎంటీఎస్ ఉపాధ్యాయుల యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొల్లి రామకృష్ణ

విద్యార్థుల ప్రాణాలంటే లెక్కలేదా..?


కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం గిరిజన సంఘాల నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు

- కలెక్టరేట్ వద్ద గిరిజన సంఘాల ఆందోళన

పార్వతీపురం రూరల్: జిల్లాలోని గిరిజన సంక్షేమ వసతిగృహ విద్యార్థులు అనారోగ్యంతో చనిపోతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని గిరిజన సంఘ నాయకులు అన్నారు. ఈ మేరకు గిరిజన సంఘాల ఆధ్వర్యంలో కురుపాం శివన్నపేట గురుకులం పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాలో 13 మంది గిరిజన విద్యార్థులు మృత్యువాత పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. కురుపాం గురుకులంలో కలుషిత నీరు కారణంగా ఇద్దరు విద్యార్థినులు మృతి చెందడం బాధాకరమన్నారు. మృతి చెందిన విద్యార్థి కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడంతో పాటు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే అన్న వసతిగృహాల్లో తక్షణమే ఏఎన్ఎంలను నియమించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్, ఆదివాసీ ఏజేఏసీ సంఘ నాయకుడు నిమ్మక జయరాజు, కురుపాం గురుకుల పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ సీతారామ్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ


సంగంవలసలో గంగా గౌరీ సమేత నందీశ్వరుని విగ్రహ ఊరేగింపు

పార్వతీపురం రూరల్:

మండల పరిధిలోని పలు గ్రామాల్లో గౌరీపౌర్ణమి సందడి కనిపిస్తోంది. ప్రతి ఏడాదీ నిర్వహించుకునే నందెన్న ఉత్సవాల్లో భాగంగా పలు గ్రామాల్లో గంగా గౌరీ సమేత నందీశ్వరుని విగ్రహాలను సోమవారం భక్తిశ్రద్ధలతో ఊరేగించి ప్రతిష్ఠించారు. సంగంవలస, కొత్తపట్నం, చినబొండపల్లి, బాలగుడబ, తదితర గ్రామాల్లో నందెన్న విగ్రహాలు ఏర్పాటు చేశారు. పాడిపంటలు బాగా వృద్ధి చెందాలని కాంక్షిస్తూ ప్రతి ఏడాదీ నందెన్న ఉత్సవాలు నిర్వహిస్తామని గ్రామపెద్దలు తెలిపారు.

పింఛన్ మంజూరు చేయరూ..

మక్కువ:


పింఛన్ మంజూరు చేయాలని కోరుతున్న నారాయణమ్మ

భర్త మృతి చెంది మూడేళ్లు కావొస్తున్నా తనకు వితంతు పింఛన్ మంజూరు కాలేదని మండలంలోని శంబర గ్రామానికి చెందిన జాడ నారాయణమ్మ ఆవేదన వ్యక్తం చేస్తోంది. సోమ వారం ఆమె మాట్లాడుతూ.. తన వయసు 69 సంవత్సరాలని.. పైగా భర్త చనిపోయినా వృద్ధాప్య పింఛన్ గాని, వితంతు పింఛన్ గాని ఏదీ మంజూరు చేయలేదన్నారు. అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఫలితం లేకపోయిందని వాపోయింది. ఇప్పటికైనా అధికారులు కనికరించి తనకు పింఛన్ మంజూరు చేయాలని కోరుతోంది.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

పార్వతీపురం రూరల్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ ఎన్. ప్రభాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పాచిపెంట, మక్కువ, సాలూరు, బలిజిపేట, సీతానగరం, పార్వతీపురం, కొమరాడ గరుగుబిల్లి, జియ్యమ్మవలస, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, వీరఘట్టం, పాలకొండ, సీతంపేట, భామిని మండలాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వ్యాధులు వ్యాపించకుండా ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అలాగే వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్ల సహకారంతో ప్రతి గ్రామంలోనూ ఇంటింటి సర్వే చేపడుతూ.. ఆరోగ్య పరిస్థితులు అంచనా వేస్తున్నట్లు తెలిపారు.

తేలని అమ్మవారి పండుగ లెక్కలు..?

- కమిటీ సభ్యుల మధ్య భిన్నాభిప్రాయాలు
- ఐదు నెలలైనా లెక్కలు చెప్పని కమిటీ సభ్యులు
- ఖర్చులపై అనుమానాలు


గ్రామదేవత నూకాలమ్మ

పాచిపెంట: పాచిపెంట గ్రామ దేవత నూకాలమ్మ పండుగ మే నెల 12, 13, 14 తేదీల్లో నిర్వహించారు. పండుగ నిర్వహణ కమిటీ సభ్యులు గ్రామంలో ప్రతి ఇంటి నుంచి వారి ఆర్థిక స్థోమతకు తగ్గట్టుగా చందాలు వసూలు చేశారు. అలా వచ్చిన డబ్బులతో ప్రజలు ఆశించి స్థాయిలో కాకుండా మొక్కుబడిగా పండుగ జరపించారు. అయితే పండుగ జరిగి సుమారు ఐదు నెలలు పూర్తవుతున్నప్పటికీ, కమిటీ సభ్యులు లెక్కలు మాత్రం తేల్చడం లేదు. దీంతో ప్రజల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రూ. లక్షల్లో వచ్చిన చందాలు..

15 ఏళ్ల తర్వాత పండుగ చేయడంతో విరాళాలు భారీగా వచ్చాయి. గ్రామస్తులతో పాటు వేరే ప్రాంతాల్లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న గ్రామానికి చెందిన వ్యక్తులు కూడా ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం వంటి డిజిటల్ చెల్లింపులు ద్వారా విరాళాలు అందజేశారు. అలా లక్షల రూపాయల చందాలు వచ్చినట్లు సమాచారం.

కమిటీ సభ్యుల్లో భిన్నాభిప్రాయాలు..

కమిటీలో పలువురు సభ్యులు ఉన్నప్పటికీ కేవలం అధికార పార్టీకి చెందిన ఇద్దరు వ్యక్తుల చేతులు మీదగానే పండుగ జరిగింది. అయితే అందులో ఒక వ్యక్తి కేవలం తన చేతికి అందిన డబ్బులు, తాను ఖర్చు పెట్టిన మొత్తాన్ని మాత్రమే ఫ్లెక్సీల రూపంలో వీధుల్లో ఏర్పాటు చేశాడు. వాస్తవానికి గ్రామ చావిటి వద్ద ప్రజల సమక్షంలో పండుగ నిర్వహణ కమిటీ సభ్యులందరూ కూర్చుని జమా ఖర్చులు ప్రజలకు తెలపాలి. కానీ అలా చేయకుండా కేవలం ఒక వ్యక్తికి అందిన డబ్బులు మాత్రమే లెక్కలు చూపించడం, అలాగే మరో ఇద్దరు కమిటీ సభ్యులను కేవలం చందాలు వసూలు చేసేందుకు మాత్రమే తీసుకువెళ్లి.. డబ్బులు ఖర్చు చేసే సమయంలో భాగస్వాములు చేయకపోవడంతో కమిటీ సభ్యుల్లో కూడా భిన్నాభిప్రాయాలు ఉన్నట్లు ప్రజలు భావిస్తున్నారు. ఇప్పటికైనా కమిటీ సభ్యులందరూ ఏకాభిప్రాయానికి వచ్చి ప్రజల సమక్షంలో లెక్కలు చెప్పాలని ప్రజలు కోరుతున్నారు. మరి కమిటీ సభ్యులు లెక్కలు చెబుతారా.. లేదా అన్నది వేచి చూడాలి.

మౌలిక సదుపాయాలపై ఆరా

మక్కువ: మండలంలోని ములక్కాయవలస గ్రామ సమీపంలోని మోడల్ పాఠశాలను ఎంపీడీఓ ఎస్. అర్జునరావు సోమవారం సందర్శించారు. పిల్లల హాజరు, ఆరోగ్యం, భోజన సదుపాయం, మరుగుదొడ్లు, పాఠశాల పరిశుభ్రత, తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను కచ్చితంగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ ఎం. సూర్యనారాయణ, మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.స్వర్ణలత, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.


మోడల్ పాఠశాలలో మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలిస్తున్న ఎంపీడీఓ అర్జునరావు

బంగారం దొంగ అరెస్ట్

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని నొండ్రుకోన పంచాయతీ, కొత్తవలస గ్రామానికి చెందిన సీమల కొండలరావు ఇంట్లో జరిగిన బంగారం చోరీ ఘటనకు సంబంధించి నిందితుడు పల్లెరిక సురేష్‌ను అరెస్ట్ చేసినట్లు ఎల్విన్‌పేట ఎస్ఐ బి.శివప్రసాద్ సోమవారం తెలిపారు. సెప్టెంబరు 12వ తేదీన ఆశ కార్యకర్తనని పంజాబీ డ్రెస్‌లో కొండలరావు ఇంటికి వెళ్లిన సురేష్.. ఇంట్లో ఎవరికైనా బాగోలేకపోతే చెప్పాలని అడిగాడు. అందరికీ బాగుందని బాగాలేని వారు ఎవరూ లేరని వారు చెప్పి, పొలానికి కుటుంబమంతా వెళ్లిపోయారు. ఇదే అదనుగా భావించిన సురేష్.. ఆ ఇంట్లోకి వెళ్లి బీరువాలోని 2 బంగారం ఉంగరాలు, ఒక జత చెవిదిద్దులు(ఒకటిన్నర తులాల బంగారం) పట్టుకుపోయాడు. ఆ తర్వాత ఇంటికి వచ్చిన కొండలరావు ఇంట్లో బంగారం దొంగిలించబడిందని గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిది పెదఖర్జ గ్రామంగా గుర్తించి, గుమ్మలక్ష్మీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సోమవారం పట్టుకుని, స్టేషన్‌కు తరలించారు. అతడి వద్ద నుంచి బంగారం రికవరీ చేశారు.


స్వాధీనం చేసుకున్న బంగారం చూపిస్తున్న ఎస్ఐ శివప్రసాద్

నిబంధనలు సడలించాలి


ఎస్పీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు

- వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు

పార్వతీపురం రూరల్: జిల్లాలో అమలు చేస్తున్న ఐపీసీ సెక్షన్-30 నిబంధనలను సడలించాలని, ప్రజా ఉద్యమాలపై నియంత్రణ, నిర్బంధాలను తొలగించాలని వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు ఎస్పీ ఎస్వీ మాధవ్‌రెడ్డిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రజా ఉద్యమాలపై ప్రభుత్వం విధించిన నిర్బంధాలను ఎత్తివేయాలని.. ఇప్పటికే ప్రజా సంఘాల నాయకులపై పెట్టిన రౌడీషీట్లు తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్పీ స్పందిస్తూ.. ముందస్తు అనుమతులపై నిబంధన సడలిస్తామని, ఇప్పటికే విధించిన రౌడీషీట్లను తొలగించేందుకు దర్యాప్తు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం.కృష్ణమూర్తి, బీవీ రమణ, జి. వెంకటరమణ, సీపీఐ నాయకుడు ఆర్‌వీఎస్ కుమార్, రైతు కూలీ సంఘ నాయకులు వర్మ, శ్రీనివాసనాయుడు, ఎస్. భాస్కరరావు, సీపీఐ నాయకులు ఈశ్వరరావు, కృష్ణ, నర్సింగరావు, గిరిజన సంక్షేమ సంఘ నాయకుడు పి. రంజిత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. రాకపోకలెలా..?


చినబోగిలి పొలం వద్ద ప్రమాదకరంగా మారిన గోతులు

- అధ్వానంగా బక్కుపేట రహదారి

సీతానగరం: మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న బక్కుపేట గ్రామానికి సరైన రహదారి లేక ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. చినబోగిలి జంక్షన్ నుంచి బక్కుపేట వరకు ఉన్న బీటీ రోడ్డు అధ్వానంగా ఉండడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారని గ్రామపెద్దలు సూర్యనారాయణ, భాస్కరరావు తెలిపారు. రోడ్డు మొత్తం గోతులతో నిండిపోయి ఉందని..ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని వారు కోరారు.


కల్వర్టు సమీపంలో ఏర్పడిన గొయ్యి

పాలకొండను జిల్లాగా ప్రకటించాలి

పాలకొండ రూరల్: పాలకొండను జిల్లాగా ప్రకటించాలని జిల్లా సాధన సమితి సభ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై సమితి గౌరవాధ్యక్షుడు కనపాక చౌదరినాయుడు సోమవారం శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌ను కలిసి పాలకొండ ప్రాంతవాసుల ఆకాంక్షను తెలియజేశారు. జిల్లా కావడానికి కావాల్సిన అన్ని అర్హతలు పాలకొండకు ఉన్నాయని, పాలకొండ పాత డివిజన్ పరిధిలోని అన్ని మండలాలతో కలిపి జిల్లా చేయాలని కోరారు. ఆయన వెంట సమితి అధ్యక్షుడు బి.అప్పలనాయుడు, కోశాధికారి నానాజీరావు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే విద్యార్థుల మరణాలు

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే విద్యార్థుల మరణాలు సంభవిస్తున్నాయని ఎంపీపీ కుంబురుక దీనమయ్య విమర్శించారు. కురుపాంలోని శివన్నపేట గురుకుల పాఠశాల విద్యార్థినులు పువ్వల అంజలి, తోయక కల్పనలు పచ్చకామెర్లతో చనిపోగా ప్రభుత్వం, అధికార యంత్రాంగం పాలనలో విఫలం కావడం వల్లే విద్యార్థినులు ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయమై ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. విద్యార్థినుల మరణాల విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రశ్నించి, అధికారులను అప్రమత్తం చేయకుంటే ఇంకెంతమంది విద్యార్థుల ప్రాణాలు పోయేవోనన్నారు. అదే పాఠశాలకు చెందిన 45 మంది విద్యార్థులు విశాఖ కేజీహెచ్, మరో 93 మంది పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవాలన్నారు. మిగతా విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టిసారించి వారికి మెరుగైన వైద్యం అందేలా మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.


ఎంపీపీ దీనమయ్య